# జై దేవరా!

మర్చంట్స్ అసోసియేషన్ వారి కళ్యాణ మండపం కళకళ లాడిపోతూంది.

దశావతారం గారి మూడో అమ్మాయి పెళ్లి రంగరంగవైభవంగా జరుగుతూంది. కన్నుల పండుగ్గా, అందరికీ పండగగా వుంది. ఆ వూరు వూరంతా అక్కడే వుందా అన్నట్లుగా వుంది.

మరి దశావతారం గారింట్లో పెళ్ళంటే మాటలా? ఆయనేవన్నా అల్లాటప్పా అప్పలనర్సయ్యా, ఏదో తూతూ పెళ్ళిగా జరిపించడానికి? ఆయన ఆ జిల్లా కేంద్రమైన ఆ పట్టణంలో ఒకానొక ప్రభుత్వ కార్యాలయంలో, ఒకానొక కీలకమైన విభాగానికి ఉన్నతాధికారి! ఆయనెంత కీలకమైన ఉన్నతాధికారంటే - ఆ పట్టణంలోని చోటా మోటా వ్యాపారస్థులందరూ రోజా ఆయనకు మొక్కందే, ముడుపులు చెల్లించుకోందే, వార్ని ప్రసన్నం చేసుకోందే వారి వారి వ్యాపార సాపారాలు సజావుగా, సాఫీగా సాగవు.

దేశంలోని సగటు ఆడపిల్లల తండ్రికి మూడో కూతురు పెళ్ళంటే నడ్డి విరగడం, ప్రాణాలు కడబట్టటం కానీ, దశావతారం గారి లాంటి ప్రభుత్వాధికారులకు అది నల్లేరు మీద బండి నడపటం! పెళ్ళి ఖర్చులన్నీ జనాల నెత్తిమీద రుద్దేయవచ్చు. పెళ్ళి శుభలేఖలు దగ్గర్నుంచి, అన్నాలు తినే అరిటాకుల వరకు వూళ్ళో వాళ్ళే చచ్చినట్లు సప్లయి చేస్తారు!

ఇది ప్రస్తుతం నడుస్తోన్న చరిత్ర - ఎవరికి మాత్రం తెలియదు?

సరే, మనమూ ఆ పెళ్ళి చూద్దాం - బ్రహ్మాండమైన ఆ హాల్లోకి పదండి!

బారులు తీర్చిన కుర్చీల్లో ఆహుతులందరూ సుఖాసీనులై కూర్చున్నారు. బట్టల కొట్లువాళ్ళూ, ఎరువుల షాపుల వాళ్ళూ, ఇనపకొట్టుల వాళ్ళూ, పచారీ వ్యాపారస్థులూ, మందుల షాపుల యజమాన్లూ, ఫ్యాన్సీ షాపుల వాళ్ళూ , హోల్‌సేల్ వాళ్ళూ, రిటేల్ వాళ్ళూ...... ఒకరేమిటి ఆవూళ్ళో వర్తక ప్రముఖులందరూ అక్కడే వున్నారు. అదొక విపణివీధి లాగా వుంది!

అందరూ తప్పనిసరయి మొక్కుబడిగా వచ్చినట్లున్నారు. ఆ మొక్కుబడులు అందంగా పేక్ చేసిన ప్రెజెంటేషన్ల రూపంలోనూ, నగదు పెట్టిన కవర్ల రూపంలోనూ వున్నాయి.

లోపల్లోపల తిట్టుకుంటున్నా పైకి మాత్రం ఆయన ప్రసన్నత కోసం, ఆయన 'గుడ్‌లుక్స్' కోసం ఎలా వెంపర్లాడుతున్నారో మీరే చూడండి!

ఆయన నూతన పట్టువస్త్రాలు ధరించి శ్రీ మహావిష్ణువులాగా ధగధగలాడిపోతూ చిర్నగవులు చిందిస్తూ, అందర్ని పలకరిస్తోన్నారు. ఆయన తాము కూర్చున్న వైపుకి రావటం అంతదూరం నుంచే

చూచిన ఎరువుల కొట్టు ఎంకటసామి క్రింద పెట్టిన సుమిత్ మిక్సీ పెట్టెను గబుక్కున వళ్ళో పెట్టుకొని రెడీగా కూర్చున్నాడు.

దశావతారం గారు తనవైపుకురాగానే టక్కున లేచి నిలబడి, సుమిత్ మిక్సీ పెట్టెను పైకెత్తిపట్టుకొని, "నమస్కారం సార్!" అన్నాడు.

ఆయన అతని చేతిలోని ఆ భారీ అట్టపెట్టెను చూచి, భారీగా తృప్తి పడిపోయారు. ఎందుకంటే, మిక్సీని ప్రెజెంటేషన్‌గా యివ్వమని ఆయన ముందే వేంకట స్వామికి ఆర్డరేశారు. మనస్సులో తిట్టుకుంటున్నా పైకి, "అంతకంటేనా సార్!" అన్నాడు. అన్నమాట ప్రకారం మిక్సీని ప్రెజెంటేషన్‌గా తెచ్చినందుకు ఆయన మహా తృప్తిపడిపోయి, "ఓహో, వేంకటస్వామి గారా కూర్చోండి, కూర్చోండి! కూల్ డ్రింకు తీసుకున్నారా?" అని నిండుగా పలకరించారు.

ఇంతలో ఆ వెనుక కుర్చీలో కూర్చున్న ఇనపకొట్టు ఇంద్రయ్య చేతి సంచిలో పెట్టుకున్న గిఫ్ట్ పేకెట్‌ను గబగబా బయటికి తీసి అది ప్రముఖంగా కనిపించేటట్లు చేత్తో సట్టుకుని, "నమస్కారం సార్!' ' అంటూ తటాలున లేచి నిలబడ్డాడు.

అతని చేతిలోని గిఫ్ట్‌పేక్ వంక చూస్తూ, 'వీడ్ని ఏం తెమ్మన్నాను?' అని వెంటనే గుర్తుకు రాక లోపల మనస్సుని గోక్కున్నారు.

ఆయన సతీమణీ, ఆయనా కూర్చొని మూడో అమ్మాయికి క్రొత్తగా కాపురానికి పంపేపటప్పుడు ఏవేం యివ్వాలో ఒక పెద్దలిస్టు తయార్జేశారు. ఏ ఐటం ఎవరెవరి దగ్గర్నుంచిరాబట్టాలో ప్రతి ఐటం ఎదురుగా వాళ్ళ పేర్లు వ్రాసుకొని వాళ్ళకు ఫోన్లు చేసి, కబుర్లు పెట్టి అందర్నీ ముందుగానే హింట్ చేశారు. ఈ ఇంద్రయ్యకు అలా ఏ ఐటం ఎలాట్ చేశారో ఆయనకు వెంటనే గుర్తుకు రాలేదు. అందుకే అతడి వంక అలా చూశారు.

ఖాతాదార్ల హావాభావ విలాసాలు గ్రహించటంలో ఆరితేరిన ఆ ఇంద్రయ్య మెడకాయిని ముందుకుసాచి, గొంతు తగ్గించి, "అమ్మాయిగారికి వెండి బొట్టు పెట్టె!" అన్నాడు.

దశావతారం గారు గుర్తుకు వచ్చినట్లు, 'ఓహో!' అని ఆనందంగా ఆర్భాటంగా నవ్వేస్తూ, "గుడ్ గుడ్! కూర్చోండి! కూల్‌డ్రింకు త్రాగారా?" అన్నారు.

ఇంతలో ఎవరో వచ్చి ఆయన్ని పిలిచారు. ఆయన కళ్యాణ వేదిక వైపు వెళ్ళారు.

ఎ. ఎంకటస్వామి వెనక్కి తిర్గి, "ఏవండీ ఇంద్రయ్య గారూ, మనల్ని కూల్‌డ్రింకు తాగారా, కూల్‌డ్రింకు తాగారా అని గురుడు తెగ పరామర్శిస్తోన్నాడు, మరా కూల్‌డ్రింకులెక్కడా కనిపించటం లేదేం?" అన్నాడు అమాయకంగా.

ప్రక్కన కూర్చున్న ఆసామీ, "మెయిన్ రోడ్డులో అజంతా కూల్‌డ్రింక్ షాపుకెళ్ళి త్రాగాలి!" అన్నాడు వ్యంగ్యంగా.

అక్కడ కూర్చున్న వాళ్ళందరూ పకపకా నవ్వేరు. ఎ.ఎ. స్వామి అయితే పడీపడీ నవ్వాడు.

కళ్యాణవేదిక మీద కన్యాదానం తంతు జరుగుతూంది.

ఇంతలో దశావతారం గారి ఆఫీసులో హెడ్‌క్లర్క్‌గా పన్జేస్తోన్న రాజారావు వచ్చాడు. ఎ.ఎ. స్వామి కూర్చున్న ముందు వరుసలో వాళ్ళ ఆఫీసు స్టాఫ్ వుంటె అక్కడికెళ్ళి కూర్చున్నాడు.

వాళ్ళంతా ఆఫీసు విషయాలు మాట్లాడుకుంటున్నారు. కొంతమంది వర్తక శిఖామణులు "ఎంట్రీటాక్స్'ని గురించి చర్చిస్తోన్నారు. మైక్‌లోంచి పెళ్ళి మంత్రాలు అనర్గళంగా వినిపిస్తోన్నాయి.

ఆఫీసు స్టాఫ్‌లో ఒకతను రాజారావుతో, "ఆర్డర్స్ ఇంత సడన్‌గా వచ్చాయేంటబ్బార్?" అంటున్నాడు.

మరో అతను ఏదో అంటున్నాడు. వాళ్ళంతా ఏదో విషయాన్ని గురించి సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు.

ఆఫీసువాళ్ళంతా అంత సీరియస్‌గా మాట్లాడుకుంటున్నది దేన్ని గురించా అన్ని ఎ.ఎ. స్వామి వళ్ళంతా చెవులు చేసుకొని వింటున్నాడు.

"ఈ విషయం ముహూర్తం అయ్యేవరకు చెప్పవాకండి రాజారావు గారు! లేకపోతే మన గురువుగారు అప్‌సెట్ అయిపోతారు!" తలనెరిసిన యూ.డి.సి.. ఒకాయన సలహాలిస్తున్నాడు.

ఎ.ఎ. స్వామి ఇక ఆపుకోలేక, తన కుర్చీని ముందుకు జరుపుకుంటూ, "ఏంటండీ రాజారావుగారు, మన దశావతారంగారికేటయింది?" అని గొంతు తగ్గించి రహస్యంగా అడిగాడు.

రాజారావు వెనక్కి తిర్గి చూచి, "ఓహో మీరా? దశావతారం గారికి శ్రీకాకుళం ట్రాన్స్‌ఫరయింది. ఇంతకుముందే టెలిగ్రాఫిక్ ఆర్డర్లు వచ్చాయి. ఈ లీవు అయిన వెంటనే నేరుగా అక్కడికే వెళ్ళి జాయిన్ అవ్వాలి!" అన్నాడు.

"బాగయింది ముండాకొడుక్కి!" అని మనస్సులో అనుకొని పైకి మాత్రం, "పాపం తీసికెళ్ళి అంత దూరం వేశారేంటండీ? చాలా మంచాయన. ధర్మాతుడు...?" అంటూ బోలెడు సానుభూతిని ప్రదర్శించాడు.

ఇ. ఇంద్రయ్యకి వీళ్ళేం మాట్లాడుకుంటున్నారో అర్థం కాలేదు. ముందుకి వంగి ఆదుర్దాగా, "ఏంటండీ ఎంకటస్వామి గారూ, ఏఁవయిందంట?" అన్నాడు.

ఎ.ఎ. స్వామి వెనక్కి తిర్గి ఆ సమాచారమంతా చెప్పాడు. అంతా విని, "అట్టాగా, చాలా సడన్‌గా అయిందే?" అన్నాడు ఇంద్రయ్య తాపీగా.

కళ్యాణవేదిక మీద జీలకర్ర బెల్లం పెట్టించూ తంతు జరుగుతూంది.

ఎ.ఎ. స్వామి ఆలోచనలో పడ్డాడు.

ట్రాన్స్‌ఫరయి వెళ్ళిపోతూన్న ఈ ముండాకొడుకు యదాన ఇంత డబ్బు పోసికొన్న మిక్సీని కొట్టాలా అనుకున్నాడు. ఎలాగు ట్రాన్స్‌ఫరయి పోయాడు, శలవు అయిపోగానే దేముడా అంటూ శ్రీకాకుళం పోతాడు. ఇలాంటోడికి చూస్తూ చూస్తూ ఇంత ఖరీదయిన బహుమతి యివ్వటమా? షాపువాడికి తీసికెళ్ళి యిచ్చేస్తే మళ్ళీ డబ్బులు వాపసు ఇస్తాడు. అంతకీ యివ్వనంటే యింట్లోకి వాడుకోవచ్చు అనుకున్నాడు. ఎన్నో రకాలుగా ఆలోచించి చివరికి ప్రెజంటేషన్‌గా తెచ్చిన మిక్సీని వెనక్కి తీసికెళ్ళిపోవటానికి నిర్ణయించుకున్నాడు. చదివించడానికి తీసికొచ్చిన దాన్ని అందరూ

చూస్తుండగా వెనక్కి ఎలా తీసికెళ్లాలా అని తీవ్రంగా ఆలోచించాడు..... ఏదో ఆలోచన తట్టింది.

మిక్సీపెట్టెను చంకలో పెట్టుకొని మెల్లగా లేచి నిలబడ్డాడు.

"ఎక్కడికండీ లేచారు ఎంకటస్వామిగారూ?" వెనుక వరుసలో కూర్చున్న ఇ. ఇంద్రయ్య అడిగాడు.

గుటక మ్రింగుతూ, "మా బాంమర్దికి ఒకమాట చెప్పడం మర్చిపోయా! ఆఫీసురూంలోంచి ఫోన్జేద్దామనీ!" అంటూ, "పెళ్ళికొచ్చినోడ్ని ముహూర్తం అవకుండా ఎక్కడికి పోతా!" అని దీర్ఘం తీశాడు.

"మారా పెట్టెకూడా తీసికెళ్ళుతారెందుకు? ఆ కుర్చీలో పెట్టి పోండి! నేను చూస్తుంటాగా?" అన్నాడు ఇంద్రయ్య.

'నీకెందుకురా ఎఱ్ఱిపీనుగా, నీ ఏడుపేదో నీవ్వేడ్వు?' అని మనస్సులో తిట్టుకుంటూ పైకిమాత్రం, "ఆఁ ఏం బరువుంది? ఫర్వాలా! నీవు ఈ కుర్చీ సూత్తుండూ, మా బామ్మర్ది గాడికి ఫోన్జేసి సిటికలో వత్తా!"

"మరెవడూ కూర్చోకుండా మారా పెట్టె ఆ కుర్చీలో పెట్టండీ!" పట్టిన పట్టు వదలకుండా అన్నాడు ఇంద్రయ్య.

'పెట్టా పెట్టా అని సత్తావేరా పాచిపీనుగా?' అని లోపల్లోపల గొణుక్కుంటూ, ఇంద్రయ్య మాట విననట్లే పెట్టెని చంకలో పెట్టుకొని తన భారీకాయాన్ని మోసుకుంటూ మెల్లగా అక్కడ్నుంచి తప్పుకున్నాడు.

అసిస్టెంటు పురోహితులు అందరికి అక్షింతలు పంచిపెట్టుతున్నారు.

ఫోన్జేయటానికి చెప్పి వెళ్ళిన ఎ.ఎ. స్వామి ఎంతకి రాకపోయేసరికి ఇ. ఇంద్రయ్యకేదో అనుమానం వచ్చింది.

గబగబా లేచి ఆఫీసు రూంకేసి వెళ్ళాడు. అక్కడ పద్దులు రాసుకుంటున్న గుమస్తా తప్ప ఎవరూలేరు. మరి ఈ ఎంకటస్వామి ఎక్కడికి వెళ్ళాడబ్బా అని ఆశ్చర్యపోతూ, మెయిన్గేటుకేసి వెళ్ళాడు.

అప్పుడే ఎ.ఎ. స్వామి మిక్సీపెట్టె చంకలో పెట్టుకొని హడావుడిగా రిక్షా ఎక్కుతున్నాడు.

రిక్షా టాప్ వేయించుకొని, "త్వరగా పోనియ్!" అని తొందర పెట్టుతున్నాడు.

ఇది చూచిన ఇ. ఇంద్రయ్య, "ఓరి దొంగముండాకొడుకా?" అని ముక్కున వేలేసుకున్నాడు.

ఈ దశావతారం ఎటూ ట్రాన్స్ఫరయి వెళ్ళిపోతున్నాడు గదా అని తీసికొచ్చిన బహుమతి చదివించకుండా వెనక్కు తీసికెళ్ళిపోతున్నావా అనుకున్నాడు.

కళ్యాణమండపంలోకి వెళ్ళబోయి ఎందుకో ఠక్కున ఆగిపోయాడు. అతడి బిజినెస్ బుఱ్ఱ కూడా చకచకా ఆలోచించేస్తోంది. తానుకూడా ఎంకటస్వామిలాగా జారుకుంటే రెండువేల రూపాయలు చేసే వెండిబొట్టుపెట్టె ఎంచక్కా తనకే వుండిపోతూందనుకున్నాడు. ఈ ఎంకటస్వామికి తట్టిన ఆలోచన ముందే తనకు తట్టలేదు ఏంటి చెప్మా అనుకున్నాడు. సరే ఇదీ ఒకందుకు మంచిదే అనుకుంటూ గిఱ్ఱుక్కున వెనక్కి తిరిగాడు.

బయటికి వచ్చి తనూ ఒక రిక్షా ఎక్కేశాడు.

* * *

ఆ మర్నాడే దశావతారంగారు ఒక సూటుకేసులో బట్టలూ, ఆ బట్టలక్రింద నోట్లకట్టలూ సర్దుకొని హైదరాబాదు రైలెక్కారు.

మూడోనాటికల్లా ట్రాన్స్‌ఫరు ఆర్డర్లును కాన్సిల్ చేయించుకొని కాలరెగరేసుకుంటూ వచ్చారు. లీవ్ కాన్సిల్ చేసుకొని ఆరోజే డ్యూటీలో జాయిన్ అయిపోయారు. శక్తివంతమైన తన సీటును మళ్ళీ అధిష్టించారు.

ఆ సాయంత్రం ఆయన సతీమణి, "అవునండీ లిస్టులో మనం వేసిన ఐటమ్స్ అన్నీ ప్రెజెంటేషన్లుగా రాలేదేమిటండీ" అంది.

"అన్నీ రాకపోవటమేమిటే వెర్రిమొగమా, నీవు సరిగ్గా చూచి వుండవు!" అన్నారాయన.

"అయ్యోరామా, లిస్టు దగ్గర పెట్టుకొని వచ్చిన వాటికన్నీ టిక్కులు పెట్టుతూ అమ్మాయిలూ, నేనూ చూశామండీ! సుమిత్ మిక్సీ, వెండి బొట్టుపెట్టె ఇవి రెండూ రాలేదు. మిగతావన్నీ వున్నాయి. రేపు అమ్మడ్ని కాపురానికి పంపేటప్పుడు ఇవి రెండూ కొనాలా ఏంటో?" అని వాపోయింది ఆ యిల్లాలు.

'అమ్మ వెధవల్లారా!' అని ఆయన సాలోచనగా తల పంకించి, కోపంగా పళ్ళు కొరికారు.

ఆ మర్నాడు ఎ.ఎ. స్వామి, ఇ. ఇంద్రయ్య షాపుల మీద చెకింగ్ స్క్వాడ్స్ విరుచుకుపడ్డాయి.

వాళ్ళిద్దరూ లబోదిబోమన్నారు. నెత్తీ నోరూ కొట్టుకుంటూ దశావతారంగారి ఆఫీసుకు పరుగెత్తారు.

* * *

మర్నాడు ప్రొద్దుటే దశావతారం గారింటిముందు ఒకదాని తర్వాత ఒకటి రెండు రిక్షాలు ఆగాయి.

మొదటి రిక్షాలోంచి ఎ.ఎ. స్వామి దిగాడు. అతడి చేతిలో సుమిత్ మిక్సీ పెట్టెతో పాటు, మరో పేకెట్ వుంది. రెండో రిక్షాలోంచి ఇ. ఇంద్రయ్య దిగారు. అతని చేతిలో కూడా రెండు పేకెట్లున్నాయి.

ఒకరిమొగం ఒకరు చూచుకున్నారు. ఏడ్వలేక నవ్వి, నవ్వలేక ఏడ్చారు.

ఇ. ఇంద్రయ్య, "నా కొంప ముంచారుకదండీ ఎంకటస్వామిగారూ! ఎరక్కపోయి మీరు చేసిన కక్కుర్తిపనే నేను చేశాను. మీ మూలంగా ఇదిగో ఈ పన్నీరు బుడ్డి ఎగస్ట్రాగా ఫైన్ పడింది. ఒక్కదాన్తో పోయేదానికి రెండు అయ్యాయి!" వాపోయాడు.

"నీకే కాదు నాకూ ఇదిగో ఈ గోడ గడియారం అపరాధపు కానుకగా వేశాడు! సరే, నేనేదో గడ్డి తిన్నాననుకో. నన్నుచూచి నువ్వూ అదే తినాలా?" ఎద్దేవగా అన్నాడు.

"ఎవరూ?" అంటూ లోపల్నుంచి దశావతారంగారు బయటికి వచ్చారు.

"మహాప్రభు! తప్పయిపోయింది. మీరు రక్షించాలి!" కోరస్‌గా అంటూ యిద్దరూ రెండు చేతులెత్తి దణ్ణాలు పెట్టారు.

- స్వాతి మాసపత్రిక *(1987)*

★